క్లుప్తంగా

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు



హైవేపై ఆశ్రం ఎదుట ప్రమాదాల నివారణ చర్యలు పర్యవేక్షిస్తున్న ఎస్సై స్వామి

దెందులూరు: జాతీయ రహదారిపై ఆశ్రం–సోమవరప్పాడు బైపాస్ మధ్య వ్యాసగాని బ్రిడ్జి సమీపంలో భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఎస్పీ కె.ప్రతాపశివకిషోర్ ఆదేశాల మేరకు దెందులూరు ఎస్సై కె.స్వామి చొరవ తీసుకుని చర్యలు ప్రారంభించారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులను కలిసి అక్కడ ఉన్న సిమెంట్ రాళ్లను తొలగించి రేడియం స్టిక్కర్లు, రేడియం కోన్స్, డ్రమ్ములు, సైన్‌బోర్డులు, బారికేడ్లను ఏర్పాటు చేయించారు. సోమవారం తెల్లవారుజామున రాజమండ్రి వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న మోటారుసైక్లిస్టు వ్యాసగాని బ్రిడ్జి వద్ద చీకట్లో కనపడక పక్కనే సిమెంట్ రాళ్లను ఢీకొట్టి తీవ్ర గాయాలై మృతి చెందాడు.

పశువుల సంరక్షణపై దృష్టి

గణపవరం(ఉంగుటూరు): వర్షాకాలం సీజన్‌లో పశువుల సంరక్షణపట్ల పశువైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే పి.ధర్మరాజు అన్నారు. మంగళవారం నారాయపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన నియోజకవర్గంలోని నాలుగు మండలాల పశువైద్యశాఖ ఏడీలు, వైద్యులతో పశువుల సంరక్షణపై సమీక్ష నిర్వహించారు. భీమడోలు, గణపవరం పశుసంవర్ధకశాఖ ఏడీలు సాయిరమేష్, డీఎం నాయక్, పశువైద్యులు శిరీష, కిషోర్, అశోక్, సత్యనారాయణ, సందీప్, హరికృష్ణ, రమ్యశ్రీ, జ్యోతి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పోరాడుదాం

ఏలూరు (టూటౌన్): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సమరశీల పోరాటాలు చేస్తామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె.గోపి అన్నారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్ త్రిచక్రం ఆటో డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) అధ్యక్ష ఎన్నికలు స్థానిక ఆటో స్టాండ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన అడ్డాల రాజు (నాని)కి జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె.గోపి, ఉపాధ్యక్షుడు చక్రాల అమర్‌కుమార్ అభినందనలు తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ చలానాలు రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులకు ఉరితాడులా మారిన బీఎన్ఎస్ 106 (1, 2)లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ సర్పంచ్‌లకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ సర్పంచ్‌ల హక్కులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెండెం సంతోష్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ వివరాలను సంతోష్ కుమార్ ఏలూరులో వెల్లడించారు. రాష్ట్రంలోని 13,371 సర్పంచ్‌లలో సుమారు 4 వేల మంది ఎస్సీ సర్పంచ్‌లు ఉన్నట్టు చెప్పారు. సర్పంచ్‌ల ప్రొటోకాల్ విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, స్థానిక రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ సర్పంచ్‌లకు న్యాయం చేయాలని సంతోష్ కుమార్ కోరారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజంలో మానవ అక్రమ రవాణా సర్వసాధారణంగా మారిందని, అపరిచిత వ్యక్తులతో బాలలు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మానవ అక్రమణ రవాణా దినోత్సవ సందర్భంగా స్థానిక సెయింట్ గ్జేవియర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ సంఘ విద్రోహ శక్తులు బాలలను అపహరించినప్పుడు 1098కు లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సమాచారం అందించా లని సూచించారు. ప్యానల్ లాయర్ కూన కృష్ణారావు, ట్రైనీ మాస్టర్ టి.సుబ్బారావు, సోషల్ వర్కర్ ఎం అజయ్ బాబు, ప్రధానోపాధ్యాయులు ఐ.రాజు ప్రసాద్ పాల్గొన్నారు.

నీటి విడుదలపై హర్షం

దెందులూరు: కృష్ణా డెల్టా పరిధిలో సాగు భూములకు పట్టిసీమ ఎత్తిపోతల కాలువ నుంచి నీరు విడుదల చేయడంపై మాజీ ఎంపీపీ కొడాలి ఆంజనేయచౌదరి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు), నాయకులు మంగళవారం వ్యక్తం చేశారు. డెల్టా రైతుల తరఫున ఎమ్మెల్యే చింతమనేనికి, ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడికి పలువురు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

అందుబాటులో అత్యాధునిక కంటి వైద్యం



దెందులూరు సీహెచ్‌సీలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు



కళ్లజోడు పంపిణీ చేస్తున్న ఆప్తమాలజీ అసిస్టెంట్ రాజ్‌కుమార్



పంపిణీకి సిద్ధంగా ఉన్న కళ్లజోళ్లు

- దెందులూరు సీహెచ్‌సీలో వైద్య పరీక్షలు
- ఇప్పటికే 23,736 మందికి పరీక్షలు
- పెరుగుతున్న డయాబెటిక్ రెటీనోపతి బాధితుల సంఖ్య

దెందులూరు: కారణాలు ఏమైనప్పటికీ అధికంగా డయాబెటిక్ రేటినోపతి వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతోందని వైద్యులు అన్నారు. గతంలో కంటికి సంబంధించి ఏదైనా వైద్య పరీక్షలు, సేవలు పొందాలంటే ఏలూరు జిల్లా వైద్యశాలకు వెళ్లాల్సిందే. గత ఐదేళ్లల్లో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారు. కంటిచూపు లోపం పరీక్షలకు పరిమితమే కాకుండా సండస్, ఆటోరిఫ్రేటివ్ మీటర్లను సైతం దెందులూరు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ (సీహెచ్‌సీ)లో ఏర్పాటుచేశారు. సండస్‌ద్వారా డయాబెటిక్ రేటినోపతి వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, తీవ్రత తెలియజేస్తుంది. ఆటోరిఫ్రేటివ్ మీటర్ దృష్టిలోపం దగ్గర, దూరం,లోపం పర్సంటేజ్‌ను నిర్ధారిస్తుంది. దెందులూరు సీహెచ్‌సీలో నియోజకవర్గ వైద్యశాలలో ఈ అత్యాధునిక పరికరం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ విభాగంలో కంటి వైద్యులు కె.విజయభాస్కర్, వి.రాజ్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు దెందులూరు నియోజకవర్గంతోపాటు హనుమాన్ జంక్షన్, భీమడోలు మండలం, ఏలూరు రూరల్‌లో ఇతర ప్రాంతాలనుంచి గణనీయంగా రోగులు దెందులూరు సీహెచ్‌సీకి వస్తున్నారు. రోజుకు ఓపీ 60కు పైగా ఉంటుంది. ప్రస్తుతం అధికంగా డయాబెటిక్ రెటీనోపతి బాధితులు పెరుగుతున్నారు. ఇప్పటి వరకు దెందులూరు నియోజకవర్గంలో 23,736 మందికి పరీక్షలు చేశారు. 11,618 మందికి రెటీనా పరీక్షలు చేశారు. 17,612 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

సెల్‌ఫోన్ అధిక వినియోగంతో కంటి సమస్యలు

ముఖ్యంగా చిన్నపిల్లలు సెల్‌ఫోన్ చూడటం వల్ల వారిలో కంటి చూపు మందగించడం, చిన్నవయస్సులోనే కళ్లజోడు అవసరమవడం, తలకు సంబంధించిన వ్యాధులు రావడంతో పాటు సెల్‌ఫోన్ వినియోగాన్ని బట్టి కంటిచూపు పోయే ప్రమాదం ఖచ్చితంగా ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు. తల్లిదండ్రులు, బంధువులు, పిల్లలకు సెల్‌ఫోన్, ట్యాబ్‌ల వినియోగంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోకపోతే వారు ప్రమాదంబారిన పడే అవకాశం ఉంది. కంటి లోపం రాకుండా పాలు, గుడ్లు, మునగాకు, ఆకుకూరలు ఎక్కువగా ఆహారంగా తీసుకోవాలని, ప్రతి సంవత్సరం కంటి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పీజీ కోర్సు ప్రారంభం



ప్రొఫెసర్లతో నారాయణపురం డిగ్రీ కళాశాల అధ్యాపకులు

ఉంగుటూరు: నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరం నుంచి ఎం.కామ్ జనరల్ కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్లు పి.అశోక్, ఎస్.ఉదయభాస్కర్ కళాశాలలో ఎం.కామ్ కోర్సు ప్రారంభించడానికి అవకాశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో కళాశాలలో కోర్సు ప్రారంభానికి అవకాశం కలిగిందని, విద్యార్థులు ఈకోర్సులో చేరాలని ఆయన కోరారు. కోర్సు వివరాలు తెలుసుకునేందుకు కో–ఆర్డినేటర్ పి.బాబూరావును సంప్రదించాలని కోరారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు పరిశీలించే కార్యక్రమంలో సహాయకులుగా బి.వెంకటేశ్వరరెడ్డి వ్యవహరించినట్లు చెప్పారు.

సందడిగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నిడమర్రు జెడ్పీ స్కూల్లో 39 ఏళ్ల తర్వాత కలుసుకున్న 1985-86 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

నిడమర్రు: నిడమర్రు జెడ్పీస్కూల్లో 1985–86 సంవత్సరంలో పదో తరగతి చదువుకుని 39 ఏళ్ల తర్వాత తిరిగి ఆదే పాఠశాలలో మంగళవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ స్కూల్లో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్న నాటి స్నేహితుల ఆనందానికి అవధుల్లేవు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, తోటి మిత్రులను ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి గురువులైన రుద్రరాజు రామకృష్ణంరాజు, జువ్వల రాంమ్మూర్తి, వేగిరెడ్డి లక్ష్మణరావు, ఇంటి మురళీకృష్ణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, టి.కాశీ అన్నపూర్ణను ఘనంగా సత్కరించి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాధ్యులుగా ఆ బ్యాచ్ విద్యార్థులు వగ్వాల సూర్యనారాయణ, గొట్టుముక్కల నరేంద్ర వర్మ, సంపంగి రంగారావు, చీమకుర్తి నాగబాబు, అత్తిలి పాండురంగారావు వ్యవహరించారు. ఈ సందర్భంగా వారంతా పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ప్రస్తుత సిబ్బందికి హామీ ఇచ్చారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక శ్రద్ధ



ధ్వంసమైన తూరలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కేపీ చంద్రశేఖర్, ఈవోఆర్‌డీ ఏ.సుందరి

భీమడోలు: వర్షాకాలంలో పంచాయతీలు పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏలూరు డీఎల్‌పీవో కేపీ చంద్రశేఖర్ అన్నారు. గుండుగొలనులో చేపట్టిన పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రధాన డ్రైయిన్ల వద్ద తూరలు ధ్వంసం కావడంతో మురుగు నీరు కిందకు వెళ్లే అవకాశం లేకపోవడంతో దుర్వాసన కొడుతోందని షాపుల యాజమానులు డీఎల్‌పీవో దృష్టికి తీసుకుని వచ్చారు. డ్రైయిన్లలో సిల్ట్ పేరుకుపోవడంతో పారిశుధ్య కార్మికులతో దగ్గరుండి పూడిక తీయించి డ్రైయిన్లను శుభ్రం చేయించారు. ఈ సీజనల్‌లో జిల్లా అధికారులు సూచించిన కార్యాచరణ ప్రణాళికను పంచాయతీల్లో అవలంభిస్తే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రతి రోజు పారిశుధ్య పనులు చేస్తే సమస్యలు తలెత్తవని, పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టిని సారించాలని కోరారు. సీజనల్ వ్యాధులు రాకుండా పంచాయతీలు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు స్వేచ్ఛమైన మంచినీటి అందించాలని గ్రామ కార్యనిర్వాహక అధికారి మురళీకృష్ణకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ఏ.సుందరి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్లకు వైభవంగా ఆషాఢ సారె సమర్పణ



భద్రకాళి దేవాలయంలో అమ్మ వారికి సారె సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారికి ఆషాఢ మాస సారె కావిడి తీసుకువెళుతున్న భక్తులు

ఉంగుటూరు: స్థానిక భద్రకాళి ఆలయంలో అమ్మవారికి ఉంగుటూరులోని తూర్పు కాపులు ఆషాఢ సారె సమర్పించారు. మంగళవారం ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని కనకదుర్గమ్మకు సారె సమర్పించడంతోపాటు గ్రామంలోని అమ్మవార్లకు సారెలను సమర్పించారు. గ్రామ దేవత చల్లాలమ్మకు, చిన్న చల్లాలమ్మకు, భద్రకాళి అమ్మవారికి, కొండాలమ్మకు, జువ్వాలమ్మకు సారె సమర్పించారు. వందలాది మంది మహిళలు సారెలను చేత పుచ్చుకుని పసుపు, కుంకుమ, చీరలు ఊరేగింపుగా, బాణసంచా కాలుస్తూ ఆలయానికి తీసుకువెళ్లారు. అమ్మవార్లకు సారె సమర్పించు కార్యక్రమం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది

ఉధృతంగా ప్రవహిస్తున్న గుండేరు



దెందులూరు సైఫన్ వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న గుండేరువాగు



సైఫన్ వద్ద ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు

దెందులూరు: గుండేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు, ఎగువనున్న మండలాల నుంచి వస్తున్న వర్షపునీరు తోడై వాగు ప్రమాదకర స్థాయిలో ఉంది. సీతంపేట కాలువలో ముంపునగురై దెందులూరు సైఫన్ నుంచి రోడ్డు ప్రాంతానికి వర్షపునీరు వస్తోంది. మరో వైపు రైతులు, రైతు నాయకులు వర్షాలకు ముందే సైఫన్ వద్ద ముందస్తు చర్యగా ఇసుక బస్తాలను, రక్షణ చర్యగా ఏర్పాటు చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో ఇదే సైఫన్ వద్ద తల్లి, కూతురు కొట్టుకుపోగా తల్లి మృతి చెందగా కుమార్తెను స్థానికులు కాపాడారు.

ప్రత్తికోళ్లలంక ఎంపీటీసీ రాజీనామా

ఏలూరు రూరల్ : కొల్లేరు గ్రామం ప్రత్తికోళ్లలంక ఎంపీటీసీ బలే సత్యప్రసాద్ తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని జెడ్పీ సీఈఓకు అందజేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామచేశానని సత్యప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజును కలిశారు.

పాఠశాలలో ఉత్సాహంగా శుభదిన్ భోజనం



అన్నేవారిగూడెంలో చిన్నారులకు భోజనంలో స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమడోలు: దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో శుభదిన్ భోజనం కార్యక్రమం రెండోరోజైన మంగళవారం కొనసాగించారు. ఈనెల 29న ఈ కార్యక్రమం ముగిసినప్పటికీ దాతల సాయంతో ఆ పాఠశాలలోని బాలబాలికలకు పసందైన విందు భోజనాలు వడ్డించారు. దెందులూరు మండలం దోసపాడుకు చెందిన కాటి ప్రకాష్ 120 మందికి నేతి స్వీట్లు పంపిణీ చేశారు. డొక్కసీతమ్మ మధ్యాహ్నభోజనం పథకంలో మెనూ మేరకు పులిహోర, దొండకాయ పచ్చడితో పాటు చిన్నారులకు స్వీట్లు అందించారు. దాత ప్రకాష్‌ను హెచ్ఎం ఎస్‌కే మస్తాన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు స్వర్ణలత, విజయకుమారి, జ్యోతిబస్, దుర్గాప్రసాదిని, ఝాన్సీ, రవి భారతి, శారరాణి, రవికుమార్ పాల్గొన్నారు.

బోర్‌వెల్ పరికరాల చోరీపై కేసు నమోదు



చోరీ వివరాలు తెలుపుతున్న రైతులు

ఉంగుటూరు: నల్లమాడులో ఆరుగురు రైతులకు సంబంధించి వారి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న బోర్‌వెల్ పరికరాలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు రైతులు మంగళవారం చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ పొలంలో ఉన్న బోర్‌వెల్ స్టార్టర్లు, టైర్లు, ఫ్యూజ్ క్యారియర్లు, మోటార్లకు సంబంధించిన తీగలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.10వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కరేడి ఇవాంజలి, ఆచంట చిన్నారి, బిక్కిన నాగేశ్వరరావు, మండ పోతురాజు, సుంకవల్లి శ్రీరామవతారం, వడ్లమూడి సాయికృష్ణ ఉన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు: విద్యార్థులు విద్యపట్ల శ్రద్ధ చూపి ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని నారాయణపురం ఇంటర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో , కళాశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారయ్యే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేను కళాశాల అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, సర్పంచ్ దిడ్ల అలకనంద, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎంఈవో శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ, మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల విద్యాసామర్థ్యాల పరిశీలన

విద్యా విషయక కార్యక్రమాల అమలుకు కృషి చేయాలి



గుండుగొలనులో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: విద్యా విషయక కార్యక్రమాల అమలులో ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా పని చేయాలని భీమడోలు ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుండుగొలను–1 పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలైన విద్యా ప్రవేశ్, శిక్షా సప్తాహ్, స్టూడెంట్ కిట్, పీఎం పోషణ్, శుభ తిథి కార్యక్రమాల అమలు తీరును ఆయన పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులతో మమేకమైన ఆయన తరగతుల వారీగా చిన్నారుల నైపుణ్యాలను, విద్యా సామర్థ్యాలు, చతుర్విధ ప్రక్రియలను ఆయన పరిశీలించి టీచర్లకు పలు సూచనలందించారు.విద్యార్థుల ప్రగతిని వారి తల్లిదండ్రులకు తెలియజేయాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని టీచర్లు అంకితభావంతో పని చేసి విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులు కావాలని కోరారు. ప్రభుత్వ బడుల్లోని పూర్తిస్థాయి సమకూరిన మౌలిక వసతులతో పాటు ఉత్తమ విద్యాబోధనను విద్యార్థులంతా అందిపుచ్చుకోవాలని కోరారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరులో ఎంఈవో– 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు పాశం పాండురంగారావు, పి.నిర్మలకుమారి, టీచర్లు మండే సుధాకర్, ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఆర్‌సీ సిటీ ఇన్‌చార్జ్‌గా కొత్యాల



కొత్యాల కార్తీక్ నియామక పత్రాన్ని అందిస్తున్న ఎన్‌సీఆర్‌సీ సభ్యులు

నిడమర్రు: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ (ఎన్‌సీఆర్‌సీ) గణపవరం సిటీ బాధ్యులుగా బువ్వనపల్లికి చెందిన ప్రముఖ ఆక్వా రైతు కొత్యాల కార్తీక్‌ను నియమించినట్లు ఆ కమిషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ తెలిపారు. ఈ మేరకు మంగళవారం బువ్వనపల్లిలోని ఎన్‌సీఆర్‌సీ ఈస్ట్ జోన్ కార్యాలయంలో నేషనల్ చైర్మన్ డాక్టర్ ఎంవీఎల్ నాగేశ్వరరావు అందించిన నియామక పత్రాన్ని ఎన్‌సీఆర్‌సీ సభ్యులు కార్తీక్ అందించారు. ఈ సందర్భంగా కొత్యాల కార్తీక్ మాట్లాడుతూ ఎన్‌సీఆర్‌సీ విధి విధానాలకు కట్టుబడి గణపవరం పరిస ప్రాంతాల్లో వినియోదారుల సమస్యలు పరిష్కరించేందకు తనవంతు కృషి చేస్తానని, ఈ అవకాశం కల్పించిన కమిషన్ స్టేట్ చైర్మన్ బల్ల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వైస్ చైర్మన్లు నోచర్ల శ్రీనివాసరావు, సంకు నాగేషు, కొరుపోలు అప్పారావు తదితరులున్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



పూళ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ధ్యానం వల్ల ప్రయోజనాలను వివరిసున్న సతీష్

భీమడోలు: విద్యార్థి దశ నుంచి ధ్యానం ఆచరిస్తే మానసిక ప్రశాంతతను పొంది చదువులో రాణిస్తారని భీమవరానికి చెందిన ధ్యాన్య బోధకులు సతీష్ అన్నారు. మండలంలోని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వాహకులు పచ్చా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో భీమడోలు, పూళ్ల, ఎంఎంపురం ఉన్నత పాఠశాలల్లోను, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని బాలబాలికలకు ధ్యాన విద్యార్థి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన బోధకుడు సతీష్ చిన్నారులకు ధ్యాన ముద్రలు, ధ్యానం వల్ల ప్రయోజనాలు, గుణ మార్పు, విద్య పట్ల శ్రద్ధ, జ్ఞాపకశక్తి, మానవత విలువలు పెంపొందించుకోవడం తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. నిర్వాహకులు పచ్చా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని పాఠశాలలు, వసతి గృహాల్లో వారం రోజుల పాటు ధ్యాన విద్యార్థి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.